
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 11 । జూన్ । 2025



సోమశిలలో 39.840 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 39.840 టీఎంసీలు ఉన్నాయి. 136 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డెల్టాకు 3,880, ఉత్తర, దక్షిణ కాలువలకు 650 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.99,400
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,999
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,269
సవర (8 గ్రాములు)	రూ.74,152

గరిష్టం/కనిష్టం
39.3 /31.0

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణశాఖాధికారులు తెలిపారు. మంగళవారం గాలిలో తేమ 43 శాతంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైఎస్ జగన్‌తో ప్రసన్న భేటీ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, రజత్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజయ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఇటీవల ప్రసన్న చేతికి శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలుసుకుని జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. ప్రసన్నకుమార్‌రెడ్డిని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రసన్నకుమార్‌రెడ్డితో, రజత్‌కుమార్‌రెడ్డితో జిల్లాలోని తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, పలు అంశాలపై చర్చించారు.

వైఎస్ జగన్ పర్యటనకు హెలిప్యాడ్ పరిశీలన

వెంకటాచలం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో మండలంలోని కాకుటూరు సమీపంలో హెలిప్యాడ్‌ను వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం పరిశీలించారు. కూటమి ప్రభుత్వం మోపిన అక్రమ కేసులతో జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరుకు రానున్నారు. మంగళవారం ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి పి అనిల్‌కుమార్ యాదవ్, పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డి తదితరులు హెలిప్యాడ్‌ను పరిశీలించారు.

డ్వామా అడిషనల్ పీడీగా స్వరూప్

నెల్లూరు (పొగతోట): జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అడిషనల్ పీడీగా స్వరూప్‌ని నియమిస్తూ పంచాయతీరాజ్‌శాఖ రాష్ట్ర అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కోనసీమ జిల్లా డ్వామా కార్యాలయంలో ఏటగా పనిచేస్తున్న స్వరూప్‌ను నెల్లూరు అడిషనల్ పీడీగా నియమించారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులును కందుకూరు క్లస్టర్ ఏపీడీగా నియమించారు.

జెడ్పీలో 65 మంది ఉద్యోగుల బదిలీలు

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న పరిపాలనాధికారులు, సీనియర్, జూనియర్ సహాయకులు, టైపిస్టులు, రికార్డు ల్యాబ్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేటర్లను బదిలీ చేశారు. మొత్తం 183 మంది అధికారులు, ఉద్యోగులు బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న 45 మందిలో 32 మందిని, రిక్వెస్ట్ చేసుకున్న ఉద్యోగుల్లో 33 మందిని మొత్తం 65 మందిని వివిధ ప్రాంతాలకు బదిలీలు చేశారు. ఇందులో ఐదుగురు పరిపాలనాధికారులు, ఒకరు సీనియర్ సహాయకులు, 12 మంది జూనియర్ సహాయకులు, ఒక టైపిస్టు, 25 మంది రికార్డు, ల్యాబ్ అసిస్టెంట్లు, 21 మంది ఆఫీస్ సబార్డినేటర్లు ఉన్నారు. నిబంధనల మేరకే బదిలీలు చేశామని జిల్లా పరిషత్ సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు తెలిపారు.

గురుకులాల కో ఆర్డినేటర్‌గా ప్రభావతమ్మ


నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల జిల్లా కో ఆర్డినేటర్‌గా డాక్టర్ ప్రభావతమ్మను నియమిస్తూ మంగళవారం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ ఉత్తర్వులిచ్చారు. విశాఖపట్నంలో పనిచేస్తున్న ప్రభావతమ్మను జిల్లాకు బదిలీ చేశారు. జిల్లాలో కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న పద్మజను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు.

గోవర్ధన్‌రెడ్డికి 23 వరకు జ్యుడీషియల్ రిమాండ్

నెల్లూరు (లీగల్): సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై గుంటూరు సీఐడీ పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారు. ఈ కేసులో పీటీవారెంట్‌పై సీఐడీ పోలీసులు మంగళవారం నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి కాకాణిని గుంటూరు 6వ అదనపు మున్సిఫ్ (ప్రత్యేక సీబీసీఐడీ) న్యాయస్థానంలో హాజరు పరిచారు. న్యాయమూర్తి ఈ నెల 23వ తేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు ఉత్తర్వులిచ్చారు. గోవర్ధన్‌రెడ్డి తరఫున న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అనంతరం గోవర్ధన్‌రెడ్డిని గుంటూరు నుంచి నెల్లూరు కేంద్రకారాగారానికి తరలించారు. గుంటూరు న్యాయస్థానం వద్ద గోవర్ధన్‌రెడ్డి అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ఖాకీలా.. కిరాయి రౌడీలా

జిల్లాలో కొందరు కింది స్థాయి ఖాకీలు లైసెన్స్‌డ్ కిరాయి రౌడీల్లా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీడీపీ నేతల కనుసన్నల్లో పనిచేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై తమ్ముళ్లు కన్నేస్తే వాటిని వారికి కట్టబెట్టేందుకు దగ్గరుండి అప్పగిస్తుండడం ఆరోపణలకు, విమర్శలకు అద్దం పడుతున్నాయి. ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని ఓ పోలీస్ అధికారి ఖాకీ దుస్తులు తీసేసి.. పచ్చచొక్కా ధరించిన ఫక్తు టీడీపీ భక్తుడిగా మారి చేస్తున్న అరాచకాలు వివాదాస్పదంగా ఉన్నాయి. శాంతిభద్రతలు గాలికి వదిలేసి.. తమ జేబులు నింపుకొనే పనిలో ఉన్నారు.



- టీడీపీ నేతలకు అండగా దౌర్జన్యాలు, పంచాయితీలు
- సివిల్ వివాదాల్లో జోక్యం
- పోలీస్ క్రౌర్యంతో సామాన్యుల ప్రాణాలతో చెలగాటం
- వైఎస్సార్ సీపీ కార్యకర్త గుడ్డలూడదీసి కొట్టిన ఎస్సైపై హైకోర్టు ఆగ్రహం
- సంగం సీఐ వేమారెడ్డి వేధింపులపై ఓ వివాహిత ఆత్మహత్యాయత్నం
- శాంతిభద్రతలు గాలికి వదిలేసిన పోలీసులు
- న్యాయస్థానాలు అక్షింతలు వేస్తున్న తీరు మార్చుకోని పోలీస్‌శాఖ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో కొన్ని పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న అధికారులు కూటమి నేతల రెడ్‌బుక్ రాజ్యాంగానికి గులాంగిరి చేస్తున్నారు. అధికార పార్టీ నేతల అండ ఉందనే ధీమాతో స్టేషన్‌లోనే సెటిల్‌మెంట్‌లు, దందాలు నిర్వహిస్తూ కలెక్షన్ కింగ్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఇసుక, గ్రావెల్, చివరకు చికెన్ వేస్ట్ మాఫియా వరకు కొందరు పోలీసులే నిర్వహిస్తున్నారంటే వారి చీకటి దందా ఏ స్థాయికి చేరిందో ఇట్టే అర్థమవుతోంది. ఉన్నతాధికారులు రాజకీయ ప్రేరేపిత కేసులు నమోదు చేయొద్దని పదే పదే హెచ్చరిస్తున్నా.. కింది స్థాయి అధికారులు వారి ఆదేశాలను పెడ చెవిన పెడుతున్నారు. సెటిల్‌మెంట్ దందాలు, అక్రమ కేసులపైనే దృష్టి సారించి జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం రాకతోనే వైఎస్సార్‌సీపీ నేతలపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోంది. టీడీపీ అక్రమాలకు అండగా బాధితులపై కిరాయి రౌడీల్లా దౌర్జన్యాలు, పంచాయితీలు పెడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు రోజునే అనంతసాగరం మండలం శంకరనగరంలో టీడీపీ నేతల దమనకాండ మొదలైంది. వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులకు తెగబడడంతోపాటు రైతులపై రౌడీషీట్లు తెరిపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించి గొంతులను నొక్కేస్తున్నారు. మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఇప్పటికే పది అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. కావలిలోనూ అదే రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తున్నారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపారు.

ఏడాదిగా నానా ఇబ్బందులు పెట్టారు



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్పంచ్ అయిన నన్ను స్థానిక టీడీపీ నేతలు నానా ఇబ్బందులు పెట్టారు. ప్రతి విషయంలో, ప్రతి కేసులో నా పేరు నమోదు చేసి నాపై ఎఫ్‌ఐఆర్‌లు చేయించారు. ఇటీవల నా కుటుంబ సభ్యులపైనా కేసులు నమోదు చేయించారు. నేను చాలా ఇబ్బందులు పడుతున్నాను. ఎస్సీ కులానికి చెందిన నన్ను ఇబ్బందులకు గురి చేస్తూ గ్రామంలో లేకుండా తరిమేయాలని చూస్తున్నారు. – దార్ల గోపి, మర్రిగుంట సర్పంచ్

జిల్లాలో పోలీస్ క్రౌర్యం ఘటనలు



- చేజర్ల మండలం ఆదూరుపల్లిలో జమీలా అనే వివాహిత తన ఇంటి వివాదంలో రెవెన్యూ శాఖ అనుకూలమైన తీర్పు ఇస్తే.. సంగం సీఐ వేమారెడ్డి పచ్చనేతలకు తలొగ్గి సివిల్ వివాదంలో తలదూర్చారు. బాధితురాలికి రక్షణ కల్పించాల్సిన పోలీసులే అన్యాయం చేయడంతో దిక్కుతోచక జమీలా తన చావుకు సీఐ కారణమని సెల్ఫీ వీడియో తీసి సూపర్ వాస్మోల్ 33 మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది.
- అనంతసాగరం మండలంలోని రేవూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పక్కంటి వాళ్లతో పేడ దిబ్బ విషయంలో గొడవ పడ్డాడు. ఈ వివాదంలో అనంతసాగరం మండలం టీడీపీ నేత ఆదేశాలతో స్థానిక ఎస్‌ఐ సదరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తను స్టేషన్‌కు తీసుకెళ్లి బట్టలూడదీసి కట్ డ్రాయర్‌తో లాకప్‌లో పెట్టి చితకబాదారు. సదరు కార్యకర్త తనకు జరిగిన అన్యాయంపై హైకోర్టును ఆశ్రయిస్తే స్టేషన్‌లో ఉన్న సీసీ ఫుటేజ్ పరిశీలన చేయమని ఆదేశించింది. సీసీ ఫుటేజ్ పరిశీలిస్తే ఎస్‌ఐ ఆరాచకం వెలుగులోకి వచ్చింది.
- చేజర్ల మండలంలో పెళ్లేరు పంచాయతీ పుల్లనీళ్లపల్లిలో ఐదు దశాబ్దాల క్రితం దళితులకు ఇచ్చిన భూములను స్థానిక టీడీపీ నేత ఆక్రమించి కంచె వేయడంతో వివాదం చెలరేగింది. కలెక్టర్ నుంచి రెవెన్యూ ఉన్నతాధికారుల వరకు ఆ భూమి దళితులకే చెందుతుందని పేర్కొన్నా.. స్థానిక అధికారులను లొంగదీసుకున్న టీడీపీ నేత (మాజీ ఎమ్మెల్యే సోదరుడు) రికార్డులను తారుమారు చేసి దళితులను ఇబ్బందులు పెడుతున్నాడు. ఈ విషయమై ఇటీవల చేజర్ల ఎస్సై తిరుమల రావు దళితులను, టీడీపీ నేతలను స్టేషన్‌కు పిలిపించి పంచాయితీ నిర్వహించడం విశేషం. అక్కడ సైతం ఎస్సై రుబాబు చేస్తూ టీడీపీ నాయకులు చెప్పినట్లు వినాలని, టీడీపీ నేతలు ఇచ్చే సగం భూమి తీసుకోవాలంటూ బెదిరింపు ధోరణితో ఆదేశించారు. దీనికిససేమిరా అంటూ దళితులు బయటకు వెళ్లబోగా సదరు టీడీపీ నేత సేనిచ్చిన చోట భూమి తీసుకోవాలంటూ బెదిరించాడు. పోలీస్‌స్టేషన్‌లో సివిల్ పంచాయితీ పెట్టడమే తప్పు అయితే.. సదరు పోలీస్ అధికారి దళితులను నిలబెట్టి టీడీపీ నేతలను కుర్చీల్లో కూర్చోబెట్టడం గమనార్హం.
- కొన్ని నెలల క్రితం నెల్లూరు చిన్నబజారు పోలీస్‌స్టేషన్ పరిధిలో వైఎస్సార్‌సీపీకి చెందిన ముస్లిం మైనార్టీకి చెందిన నేతను స్టేషన్‌లో ఉంచి రెండు రోజుల పాటు చితకబాదారు. కారణం ఏమిటంటే నారాయణ విద్యాసంస్థల్లో పనిచేసే ముస్లింల ఉద్యోగులను రంజాన్ మాసంలో టోపీ ధరించి రావొద్దని యాజమాన్యం ఆదేశించింది. దీంతో ముస్లింల మనోభావాలు దెబ్బతిన్నాయని సదరు వైఎస్సార్‌సీపీ నేత ప్రెస్‌మీట్ పెట్టడమే తప్పయినట్లుగా భావించి పోలీసులు రెండు రోజులు స్టేషన్‌లో ఉంచి చితకబాది పంపించారు.
- కొండాపురం మండలంలో మర్రిగుంట సర్పంచ్ దార్ల గోపిపై అక్రమ కేసులు బనాయించారు. ఈ ఏడాది కాలంలో అతనిపై నాలుగు అక్రమ కేసులు బనాయించారు.

కీచక సైకోలను కఠినంగా శిక్షించాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా నాయకులు

- అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నేతల దారుణాలు
- హత్యలు, 'హత్యా'చారాలతో మహిళలకు భద్రత కొరవడింది
- పచ్చ కీచకపర్వాలపై వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన
- సీఎం, హోంమంత్రికి మంచి బుద్ధి ప్రసాదించాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలో టీడీపీ నేతలే కీచకులుగా మారడంతో మహిళల మానప్రాణాలకు భద్రత కొరవడిందని, ఇటువంటి కీచకులను కఠినంగా శిక్షించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ డిమాండ్‌చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా రాష్ట్రంలోని మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యలను అరికట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని వీఆర్‌సీ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల మీద అఘాయిత్యాలకు పాల్పడుతున్న టీడీపీకి చెందిన సైకోలను కఠినంగా శిక్షించే విధంగా సీఎం చంద్రబాబుకు, హోంమంత్రి అనితకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో మహిళలపై రోజురోజుకు అకృత్యాలు పెరిగిపోతున్నాయన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగని నేరాలు, ఘోరాలు మైనర్ బాలికలపై జరుగుతున్నాయన్నారు. మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి మాట్లాడుతూ మహిళలకు భద్రత కల్పించలేని, పచ్చకీచకులను శిక్షించలేని అసమర్థ ప్రభుత్వం, మహిళలను కించపరిచారంటూ సాక్షిపై ఆగమాగం చేయడం సిగ్గు చేటన్నారు. హోంమంత్రి ఒక మహిళ అయినప్పటికీ రాజకీయ ప్రేరేపిత కేసులపై ఉన్న శ్రద్ధ సాధారణ మహిళలపై జరుగుతున్న అన్యాయపు కేసులను పట్టించుకోవడం లేదన్నారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలో ఉండగా బాలికపై యాసిడ్ దాడి జరిగిన వెంటనే తీసుకున్న చర్యలు, జగన్‌మోహన్‌రెడ్డి దిశ చట్టాన్ని తీసుకొచ్చి మహిళలకు ఇచ్చిన రక్షణ తదితర అంశాలను గుర్తు చేశారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మీసునంద మాట్లాడుతూ పోలీసు వ్యవస్థను అక్రమ కేసులు, అరెస్టులు పెట్టి బెదిరించడానికి తప్ప రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడేందుకు వినియోగించడం లేదన్నారు. మహిళలను అన్ని విధాలుగా అణగదొక్కుతూ సాధారణ మహిళలను, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులను ఎవరిని లెక్కచేయకుండా మహిళలనే కనికరం చూపకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. మద్యపానం, గంజాయి వాడకం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. మద్యం షాపులు ఎక్కువయ్యాయన్నారు. మంచీ చెడు తెలియని వయస్సులో చెడు వ్యసనాలకు అలవాటు పడి పసిపిల్లలపై కూడా అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి దారుణ పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని, తమ ఇళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి మహిళపై ఉందన్నారు. ఆత్మకూరు జెడ్పీటీసీ, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ 'సాక్షి' టీవీలో జరిగిన ఒక డిబేట్‌లో మాట్లాడిన వ్యక్తి మాటలకు అంత విలువనిచ్చి రచ్చ చేస్తున్న టీడీపీ నాయకులకు ప్రభుత్వానికి గత వారంలోనే దాదాపు 10 మంది చిన్నారులపై జరిగిన అఘాయిత్యాలు కనిపించడం లేదన్నారు. రాష్ట్రంలో పట్టపగలు కూడా మహిళలు బయట తిరిగే స్వేచ్ఛ లేకుండా పోయిందని, అభివృద్ధిని పక్కన పెట్టి రాజకీయ కక్ష సాధింపులకు గురి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

'సాక్షి' కార్యాలయాలపై దాడులను ఆపాలి



ప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న 'సాక్షి' సిబ్బంది

నెల్లూరు సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా 'సాక్షి' కార్యాలయాలపై చేస్తున్న దాడులను ఆపాలని నెల్లూరు రూరల్ ఎస్సై ప్రసాద్‌రెడ్డికి మంగళవారం 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధాని అంశం మీద సంబంధం లేని విషయాన్ని 'సాక్షి'కి ఆపాదిస్తూ కొందరు అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా దాడులు చేయడం సరికాదన్నారు. 'సాక్షి' కార్యాలయాలపై దాడులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 'సాక్షి' సిబ్బంది పాల్గొన్నారు.

మీడియాపై కక్ష సాధింపుతో ఎమర్జెన్సీ పరిస్థితులు

- రాష్ట్రంలో శ్రుతిమించిన రెడ్‌బుక్ రాజ్యాంగం
- కొమ్మినేని అరెస్ట్ పత్రికా స్వేచ్ఛపై దాడి
- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కూటమి రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో మీడియాపై కక్ష సాధింపులతో రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొన్నాయని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మండి పడ్డారు. నగర పార్టీ కార్యాలయంలో మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న మీడియాపై సీఎం చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి టీవీ డిబేట్‌లో పాల్గొన్న జర్నలిస్ట్ చేసిన వ్యాఖ్యలను ఒక ప్రణాళిక ప్రకారం వివాదాస్పదం చేసి, సంబంధం లేని సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్ట్ చేయడం చూస్తుంటే పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారనే విషయం అర్థమవుతోందన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రతి మీడియా చానల్ సమకాలీన మేధావులతో లైవ్ డిబేట్ల ద్వారా ప్రజా సమస్యలపై జరిపే చర్చల్లో కొన్ని సందర్భాల్లో విశ్లేషకులు అసందర్భంగా మాట్లాడిన వ్యాఖ్యలను వెంటనే సరిచేసుకోవడం, కొన్ని సందర్భాల్లో వాటికి క్షమాపణలు చెప్పడం కూడా చూస్తున్నామన్నారు. ఇదే క్రమంలో ఈ నెల 6న సాక్షి టీవీ డిబేట్‌లో జర్నలిస్ట్ కృష్ణంరాజు ఒక ఆంగ్ల పత్రికలో ప్రచురితమైన కథనాన్ని ఉటంకిస్తూ మాట్లాడిన మాటలను కొమ్మినేని వారించారన్నారు. అయితే కొందరు కావాలనే రాద్ధాంతం చేస్తుండడంతో సాక్షి టీవీ యాజమాన్యం, ఇటు వైఎస్సార్‌సీపీ కూడా ఖండిస్తూ మహిళలపై తమకు ఉన్న గౌరవాన్ని చాలా స్పష్టంగా వెల్లడించాయన్నారు.

పథకం ప్రకారం రాద్ధాంతం సృష్టి

టీవీ డిబేట్‌లో కృష్ణంరాజు మాట్లాడిన మాటలను మరుసటి రోజు నుంచి రెచ్చగొట్టే ధోరణితో టీడీపీ సోషల్ మీడియా తప్పుడు ప్రచారం చేసేందుకు తెగబడిందన్నారు. మంత్రి లోకేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేయడం, టీడీపీ ఆందోళనకు దిగడం జరిగాయన్నారు. దీంతో అదే రోజు తాను చేసిన వ్యాఖ్యలపై కృష్ణంరాజు క్షమాపణలు చెప్పినా టీడీపీకి చెందిన సోషల్ మీడియా ఈ అంశాన్ని సాక్షి టీవీ యాజమాన్యానికి, మాజీ సీఎం వైఎస్ జగన్, ఆయన సతీమణి భారతికి ఆపాదిస్తూ అత్యంత దారుణంగా వ్యక్తిత్వ హననానికి పాల్పడిందన్నారు. ఆ వెంటనే చంద్రబాబు స్పందిస్తూ సోషల్ మీడియా వేదికగా హెచ్చరించడం, డిప్యూటీ సీఎం పవన్ ప్రెస్‌నోట్ రిలీజ్ చేయడం చూస్తే పథకం ప్రకారమే జరుగుతున్నట్లు అర్థమవుతుందన్నారు.

సాక్షి మీడియా కార్యాలయాలపై దాడులు

రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతుందని, సాక్షి కార్యాలయాలపైన దాడులు చేస్తున్నారన్నారు. ఏడాది పాలనపై వైఎస్సార్‌సీపీ నిర్వహించిన వెన్నుపోటు దినంకు ప్రజాస్పందన రావడంతో, ఏడాది పాలనపై సంబరాలు చేసుకుందామన్న కూటమి పార్టీల పిలుపును ప్రజలు తిరస్కరించారని, దానిని డైవర్ట్ చేసేందుకే సాక్షి మీడియాపై ఈ దాడులు జరుగుతున్నాయన్నారు.

వైఎస్ జగన్‌పై, కుటుంబంపై నిత్యం విషం

టీడీపీ సోషల్ మీడియాలో వైఎస్ జగన్, ఆయన కుటుంబంపై నిత్యం విషపూరితమైన ప్రచారం చేశారో అందరికీ తెలుసునని, టీడీపీ అనుకూల పత్రికల్లో దారుణమైన కథనాలను ప్రచురించారన్నారు. అయినా ఏ ఒక్కరిపైనా ఆయన కక్ష సాధింపులకు పాల్పడేందుకు ప్రయత్నించలేదన్నారు. గతంలో ప్రభుత్వంలో ఉన్నప్పుడు కూడా అధికారాన్ని దుర్వినియోగం చేయలేదన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారమే పనిచేస్తోందన్నారు. చివరికి సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని వంటి వారిని అరెస్ట్ చేయడం ద్వారా పత్రికలను, మీడియాను కూడా వదలి పెట్టమనే సంకేతాన్ని ఇచ్చారన్నారు.

శాంతిభద్రతలు పట్టవా?

అనంతపురం జిల్లాలో గిరిజన బాలిక తన్మయిని దుండగులు బీరు బాటిళ్లతో కొట్టి దారుణంగా హత్య చేశారు. ఇంటర్ విద్యార్థిని మిస్సింగ్‌పై ఆరు రోజుల కిందట ఫిర్యాదు అందినా, పోలీసులు పట్టించుకోలేదన్నారు. చివరికి దారుణమైన స్థితిలో ఆమె శవాన్ని పోలీసులు గుర్తించారు. సత్యసాయి జిల్లాలో తొమ్మిదో తరగతి విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన టీడీపీ కార్యకర్తలను కాపాడేందుకు పోలీసులు ప్రయత్నించారని, కేసు పెట్టేందుకు వచ్చిన బాధితులను బెదిరిస్తే వారు ఊరు వదిలి వెళ్లిపోయారన్నారు. శాంతిభద్రతల విషయంలో విఫలమైన ఇటువంటి దారుణమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని, హోంమంత్రి వంగలపూడి అనితను కీలుబొమ్మ మంత్రిగా మారారన్నారు. నారా లోకేశ్ డిఫాక్టో హోంమంత్రిగా వ్యవహరిస్తున్నారని, వైఎస్సార్‌సీపీ పలువురు మహిళా ప్రజాప్రతినిధుల గురించి గతంలో టీడీపీ నాయకులు ఎలాంటి వ్యాఖ్యలు చేశారో మరిచిపోయారా? సీఎంగా ఉన్న వైఎస్ జగన్‌పై టీడీపీ నాయకులు వాడిన భాష ఎలాంటిది? వంగలపూడి అనిత వైఎస్ జగన్ కుటుంబ సభ్యులపై ఎలాంటి మాటలు మాట్లాడారు, కిరాక్ ఆర్పీ, సీమరాజా, కిరణ్ వంటి వారు సోషల్ మీడియాలో ఎలాంటి కామెంట్లు చేశారో ప్రజలందరికీ తెలుసునని, ఇటువంటి వ్యాఖ్యలు చేసిన వారికి టీడీపీ కొమ్ముకాస్తోందన్నారు.

22 మంది తహసీల్దార్లకు స్థానచలనం

నెల్లూరు (అర్బన్): జిల్లాలో వివిధ మండలాల్లో పని చేస్తున్న 22 మంది తహసీల్దార్లను సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీ చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ మంగళవారం జాబితాను విడుదల చేశారు. ఇదే సమయంలో డిప్యూటీ తహసీల్దార్లుగా పనిచేస్తున్న ముగ్గురుకి అడహక్ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించారు. తిరుపతి కలెక్టరేట్‌లో పనిచేస్తున్న కె.శ్రీనివాసులుకు తహసీల్దార్‌గా ప్రమోషన్ కల్పించారు. నెల్లూరు ఐఓసీఎల్, ఎల్‌పీజీ అవుట్‌లెట్ డీటీగా పనిచేస్తున్న ఎస్‌కే ఫాజిహను అల్లూరు తహసీల్దార్‌గా బదిలీ చేశారు. నెల్లూరు కలెక్టరేట్‌లో డీటీగా పని చేస్తున్న ఎల్.రామమోహన్‌ను ఉదయగిరి తహసీల్దార్‌గా బదిలీ చేశారు. అలాగే 36 మంది డీటీలు, 42 మంది సీనియర్ అసిస్టెంట్లను, నలుగురు జూనియర్ అసిస్టెంట్లను ఇతర మండలాలకు బదిలీ చేశారు. మరో 15 మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించి బదిలీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన స్థానం
కె.అనిల్‌కుమార్	డీఏఓ ఆర్డీఓ ఆఫీసు, నెల్లూరు	ఏఎస్‌పేట
సీహెచ్ సుబ్బయ్య	మనుబోలు	కోవూరు
ఎ.నిర్మలానందబాబా	కోవూరు	డీఏఓ, ఆర్డీఓ ఆఫీసు, నెల్లూరు
ఎం.సుభద్ర	ఉదయగిరి	సైదాపురం
ఈ.రమాదేవి	సైదాపురం	మనుబోలు
ఎం.సురేష్‌బాబు	బోగోలు	కొండాపురం
ఎస్.శ్రీనివాసులురెడ్డి	ఎస్‌డీసీ ఏపీ మారిటైంబోర్డు, కావలి	బోగోలు
జి.రాఘవేంద్రరావు	ఎస్‌డీసీ ఏపీ మారిటైంబోర్డు, కావలి	కలెక్టరేట్, నెల్లూరు
ఎం.కోటేశ్వరరావు	కొండాపురం	లింగసముద్రం
ఎస్.సీతామహాలక్ష్మి	లింగసముద్రం	డీఏఓ, సబ్‌కలెక్టర్, కందుకూరు
ఎం.నిరంజన్	డీఏఓ, ఆర్డీఓ, ఆత్మకూరు	ఏపీఓ, ఐటీడీఏ, నెల్లూరు
ఎ.లక్ష్మీనారాయణ	అల్లూరు	ఎస్‌డీసీ ఏపీ మారిటైంబోర్డు, కావలి
ఎం.పద్మజ	దీర్ఘకాలిక సెలవు	కలెక్టరేట్, నెల్లూరు
టీవీఎం కృష్ణప్రసాద్	ఇందుకూరుపేట	నెల్లూరు రూరల్
బి.పద్మావతి	తిరుపతి జిల్లా	టీపీ గూడూరు
బి.జయవర్ధన్	ప్రకాశం జిల్లా	అనంతసాగరం
పి.పద్మజాకుమారి	కలెక్టరేట్, నెల్లూరు	ఆత్మకూరు
జి.స్వర్ణ	గుడ్లూరు	డీఏఓ, ఆర్డీఓ, ఆత్మకూరు
ఎం.నయీమ్ అహ్మద్	ప్రకాశం జిల్లా	ఓలేటివారిపాళెం
వి.సుధీర్	ఆత్మకూరు	కలెక్టరేట్, నెల్లూరు
సయ్యద్ ఇక్బాల్	డీఏఓ, సబ్‌కలెక్టరేట్, కందుకూరు	తిరుపతి జిల్లాకు కేటాయింపు
ఎస్‌ఎం హుస్సేన్	కలెక్టరేట్ నెల్లూరు	ప్రకాశం జిల్లాకు కేటాయింపు

క్లుప్తంగా

14న యోగా ప్రదర్శనలు

నెల్లూరు రూరల్: ఈనెల 14వ తేదీన జిల్లా వ్యాప్తంగా యోగా ప్రదర్శనలు నిర్వహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్ సూచించారు. మంగళవారం ఆయన జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో యోగాంధ్ర కార్యక్రమంపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రతి గ్రామంలో అనువుగా ఉన్న ప్రదేశాలను గుర్తించారన్నారు. ఇప్పటి నుంచే రోజూ ట్రెయినర్లు యోగా నిర్వహించాలని సూచించారు. 14న ప్రజలను భాగస్వాములను చేస్తూ జిల్లా వ్యాప్తంగా గుర్తించిన అన్ని ప్రదేశాల్లో ప్రదర్శనలు నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లా ప్రధాన కేంద్రంలో పెద్దఎత్తున ప్రదర్శన నిర్వహించాలని తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): నెల్లూరు బోడిగాడితోటలోని ప్రభుత్వ హాస్పిటల్ సమీపంలో అనారోగ్యమో? మద్యం మత్తులో ఊపిరాడకనో? స్పష్టమైన కారణం తెలియదు గానీ గుర్తుతెలియని వ్యక్తి సోమవారం అపస్మారక స్థితిలో పడిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మంగళవారం ఈ ఘటనపై సమాచారం అందుకున్న 5వ వార్డు వీఆర్వో భాస్కరయ్య నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు కొంతకాలంగా మద్యం తాగుతూ బోడిగాడితోట పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండేవాడని స్థానికులు పోలీసులకు తెలియజేశారు. అతని వివరాలు తెలిసిన వారు నవాబుపేట స్టేషన్‌లో తెలియజేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

రవాణా శాఖలో బదిలీలు

నెల్లూరు (టౌన్): జిల్లా రవాణా శాఖలో సాధారణ బదిలీల్లో భాగంగా ఆర్టీఓ, పలువురు ఎంవీఐలు, ఏఎంవీఐలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. సోమవారం అర్ధరాత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, రవాణా కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు ఆయా స్థానాల్లో వెంటనే రిలీవై కొత్త స్థానాల్లో వెంటనే చేరాలని ఆదేశాలు జారీ చేశారు. నెల్లూరు రవాణా కార్యాలయంలో ప్రాంతీయ పర్యవేక్షణాధికారి శ్రీచందన ప్రకాశం జిల్లా మార్కాపురం ఆర్టీఓగా, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం ఆర్టీఓ ఎండీ మదాని నెల్లూరు ఆర్టీఓగా బదిలీ అయ్యారు. గుంటూరులో ఎంవీఐ జె.అనిల్‌కుమార్ కందుకూరుకు, గుంటూరులో ఏంవీఐ ఎ.సంధ్య నెల్లూరుకు, నెల్లూరు రవాణా కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ పద్మావతి తెనాలికి, లావణ్య ఒంగోలుకు, ఎస్‌కే షాహీన్ ఒంగోలుకు బదిలీ అయ్యారు. ఒంగోలు రవాణా కార్యాలయంలో పనిచేస్తున్న ఎం.చంద్రకాంత్ కందుకూరుకు, సునీత నెల్లూరు, గుంటూరులో పనిచేస్తున్న డి.సాయిరాం నెల్లూరుకు బదిలీ అయ్యారు. నెల్లూరు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాగమల్లేశ్వరి కావలి రవాణా కార్యాలయానికి బదిలీ చేశారు.

కండలేరులో 38.220 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 38.220 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.32
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.10



స్పెషలిస్ట్ డాక్టర్ల డుమ్మా

- పెద్దాస్పత్రిలో ఇదీ పరిస్థితి
- చర్యలు తీసుకోవాలని హెచ్‌డీఎస్ కమిటీ వినతి

నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రి (సర్వజన ఆస్పత్రి)లో కొందరు స్పెషలిస్ట్ డాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ వైద్యులతో పాటు ఫిజీషియన్, గుండె, న్యూరాలజీ, కేన్సర్, మానసిక, పల్మనాలజీ, చర్మ, ఈఎన్‌టీ, దంత విభాగాల్లో స్పెషలిస్ట్ వైద్యులున్నారు. అయితే పలువురు సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని చెబుతున్నారు. బయట ప్రైవేట్ సేవలో తరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం పలు విభాగాలను పరిశీలించగా ఉదయం 10:15 గంటల వరకు కొన్ని స్పెషలిస్ట్ విభాగాల్లో డాక్టర్లు హాజరు కాలేదు. వాటిలో ప్రధానంగా న్యూరోసర్జన్, కేన్సర్ విభాగాల్లో వైద్యులు రాలేదు. అలాగే రోగులకు అవసరమైన 2డీ ఎకో పరీక్ష చేసే గదిలోనూ డాక్టర్ లేరు. ఉన్న ఒకరిద్దరూ రోగులు వేచి చూచి డాక్టర్లు రారని భావించి వెళ్లిపోయారు. తర్వాత తీరుబడిగా వచ్చినా ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు గంటపాటు కూడా ఆస్పత్రిలో ఉండలేదు. ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు.



డాక్టర్ లేక ఖాళీగా ఉన్న ఎకో స్కాన్ గది

పాపం రోగులు

పెద్దాస్పత్రికి వేలాది మంది రోగులు వస్తుంటారు. స్పెషలిస్ట్ డాక్టర్లు కొందరు సమయపాలన పాటించకపోవడం, హాజరు (థంబ్) వేసి డుమ్మా కొడుతుండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే సందర్భంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు సైతం వార్డులను పరిశీలించగా పలుచోట్ల డాక్టర్లు లేరు. ప్రధానంగా న్యూరో సర్జన్ విభాగంలో నిత్యం ఇలాగే జరుగుతోందని ఆరోపణలున్నాయి.



డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు

చర్యలు తీసుకోవాలి

న్యూరో సర్జన్ విభాగంలో డాక్టర్ దినేష్‌కుమార్ విధుల్లో లేరని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు అబిదా సుల్తానా, బ్రహ్మానందరెడ్డి, మల్లికార్జున, మొగరాల సురేష్‌లు ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డికి మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ దినేష్‌కుమార్ ఎప్పటి నుంచో విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని తెలిపారు. సీసీ కెమెరాల్లో పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. డ్యూటీలకు సక్రమంగా రాని విషయాన్ని వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. ఆస్పత్రి సమయంలో రోగులకు సేవలందాలనే ఫిర్యాదు చేస్తున్నామన్నారు.



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న న్యూరో సర్జికల్ ఓపీ

కప్పరాళ్లతిప్పలో పోలీసుల తనిఖీలు

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలో పోలీసులు మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కావలి డీఎస్పీ పి.శ్రీధర్ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, ఏడుగురు ఎస్సైలు, 72 మంది సిబ్బందితో కప్పరాళ్లతిప్ప, అల్లిమడుగు సంఘం ప్రాంతాల్లోని సుమారు 400 ఇళ్లలో తనిఖీలు చేశారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీట్ ఉన్న వ్యక్తుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించి పాత నేరస్తులు, అనుమానితుల కదలికలు, బయటి వ్యక్తుల రాకపోకలపై ఆరా తీశారు. సరైన పత్రాల్లేని 33 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. పాత నేరస్తులు, ఇతర రాష్ట్రాల్లో క్రియాశీలకంగా ఉండి నేరాలకు పాల్పడుతున్న స్థానికుల వివరాలు, నాటుసారా తయారీదారుల గురించి ఆరా తీశారు. నేరాల నియంత్రణలో భాగంగా నిఘా ముమ్మరం చేశామని, ఎటువంటి పొరపాట్లు చేసినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఒక్కసారి కేసులో ఇరుక్కుంటే తర్వాత సామాజికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి ఉంటుందని, నేరాలకు దూరంగా ఉండి శాంతియుత జీవనం గడపాలని సూచించారు. తనిఖీల్లో సీఐలు బి.పాపారావు, జి.రాజేశ్వరరావు, ఎండీ ఫిరోజ్, ఎస్సైలు భోజ్యా, కిశోర్‌బాబు, జంపాని కుమార్, బాజీ బాబు, గౌస్‌బాషా, వెంకటేశ్వర్లు, లతీఫ్ ఉన్నీసా, సిబ్బంది పాల్గొన్నారు.



కార్డన్ సెర్చ్‌కు సిద్ధమైన పోలీసులు

చెన్నైకి గంజాయి తరలిస్తుండగా..



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ మురళీధర్

- వ్యక్తి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ఒడిశా నుంచి చెన్నైకి గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని తిరుపతి జిల్లా గూడూరు రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం నెల్లూరు డీఎస్పీ జి.మురళీధర్ తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. ఒడిశా, విశాఖపట్నం నుంచి వచ్చే రైళ్లలో మత్తు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా కట్టడికి రైల్వే పోలీస్‌లు ఆర్పీఎఫ్ పోలీసుల సహకారంతో తనిఖీలు ముమ్మరం చేశారు. నెల్లూరు రైల్వే సీఐ ఎ.సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం కావలి, నెల్లూరు, గూడూరు రైల్వేస్టేషన్లు, ప్లాట్‌ఫారంలపై తనిఖీలు నిర్వహించారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దేవదాస్ టాటా నగర్ – ఎర్నాకుళం రైల్లో ప్రయాణిస్తూ గూడూరు రైల్వేస్టేషన్‌లో దిగి హడావుడి బయటకు వెళ్తుండగా ఇన్‌చార్జి రైల్వే ఎస్సై వై.చెన్నకేశవరావు అదుపులోకి తీసుకున్నారు. దాస్ బ్యాగ్‌లో మూడు కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా ఒడిశాలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి చెన్నై పరిసర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించేందుకు వెళ్తున్నట్లు అంగీకరించడంతో అరెస్ట్ చేశామని డీఎస్పీ చెప్పారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎస్సై జి.మాలకొండయ్య, ఆర్పీఎఫ్ ఏఎస్సై సీకేఎస్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కడుపు కొట్టేందుకు 'కూటమి' యత్నం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గత ప్రభుత్వంపై ఉన్న కోపంతో కూటమి సర్కారు పేదల కడుపు కొట్టేందుకు ప్రయత్నాలు చేస్తోందని పలువురు నాయకులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని డా.జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో పేదల ఆహార భద్రతపై నగదు బదిలీ ప్రభావం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వెంకమరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా సంఘ నాయకులు మాట్లాడుతూ ఇంటింటికీ వచ్చి వాహనాల ద్వారా రేషన్ ఇస్తున్న విధానాన్ని తొలగించి ప్రజలు షాపుల వద్దకు వెళ్లి తెచ్చుకునేలా చేశారని మండిపడ్డారు. సబ్సిడీపై నేడు నాలుగు రకాల వస్తువులు మాత్రమే ఇస్తున్నారని, కేరళ రాష్ట్రంలో మాదిరిగా 16 రకాల వస్తువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ బియ్యాన్ని అధికార పార్టీ నాయకులు, పెత్తందారులు పాలిష్ చేసి బయట రాష్ట్రాలకు అధిక ధరలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో నేతలు పుల్లయ్య, వెంగయ్య, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, తిరుపాలు, శ్రీరాములు, రమణయ్య, చంద్ర రాజగోపాల్, రమణ, రఘురామయ్య, రాధయ్య, షాన్‌వాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

విద్యుత్ మోటార్ల చోరీ

దగదర్తి: మండలంలోని అనంతవరం గ్రామంలో పొలాల్లోని 17 విద్యుత్ మోటార్లను సోమవారం రాత్రి దొంగలు చోరీ చేశారని ఎస్సై జంపాని కుమార్ మంగళవారం తెలిపారు. రైతుల కథనం మేరకు.. వ్యవసాయ బోర్ల బావుల వద్ద నీటి కోసం వినియోగిస్తున్న విద్యుత్ మోటార్లలోని రాగి తీగ, స్టార్టర్లు చోరీకి గురయ్యాయి. ఫిర్యాదు అందగానే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తరచూ మోటార్ల చోరీలు జరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం పంటలు వేసి ఉండటంతో మోటార్ల చోరీ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికుల మధ్య ముదిరిన గొడవ

- నిద్రమాత్రలు మింగిన కార్మికురాలు

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఓ పారిశుధ్య కార్మికురాలిని విధుల గురించి ప్రశ్నించిన నేపథ్యంలో జరిగిన గొడవ ముదిరింది. గ్లోరి అనే కార్మికురాలు వెంగళరావునగర్‌లో ఉండే తన నివాసంలో మంగళవారం నిద్రమాత్రలు మింగింది. అనంతరం 5వ నగర పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు.. గ్లోరి అనే అవుట్ సోర్సింగ్ కార్మికురాలు ఆపరేషన్ థియేటర్‌లో పని చేస్తోంది. గత శనివారం అభివృద్ధి కమిటీ కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు సాధారణ పరిశీలనలో భాగంగా థియేటర్‌కు వద్దకు వెళ్లాడు. ఆమె విధుల్లో లేదు. దీనిపై అక్కడి వారిని ప్రశ్నించాడు. ఇది జరిగిన తర్వాత కొంతమంది సహచర పారిశుధ్య కార్మికులు సూపర్‌వైజర్‌ను కలిసి ఆమె సక్రమంగా విధుల్లో లేకపోయినా పట్టించుకోరని, డ్యూటీలు కూడా ఒకేచోట వేస్తారని, అలా తమకు ఎందుకు చేయరంటూ ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో గ్లోరి తిరిగి ఆస్పత్రికి వచ్చింది. తాను అనుమతి తీసుకుని వెళ్లానని ఆమె చెబుతోంది. అయితే ఎవరికి చెప్పి వెళ్లావని సూపర్‌వైజర్ ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆమె బంధువు కాంగ్రెస్ సేవాదళ్ నేత కొండా అనిల్ సూపర్‌వైజర్, ప్రశ్నించిన పారిశుధ్య కార్మికులతో గొడవ పెట్టుకున్నాడు. కో–ఆర్డినేటర్ ముందే హెచ్చరించారు. దీంతో శ్రీనివాసులు సర్దుబాటు చేసి అనిల్‌ను పంపించారు. ఇదే విషయమై సోమవారం మళ్లీ కార్మికులతో గొడవ జరిగింది. కార్మికులు అనిల్‌పై దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నమోదైంది. కాగా గ్లోరి తనను వేధిస్తున్నారంటూ మంగళవారం తన ఇంటి వద్ద నిద్రమాత్రలు మింగింది. అనంతరం పెద్దాస్పత్రికి వచ్చి చేరింది. ఆమె ఇల్లు ఐదో నగర పరిధిలో ఉండటంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విషయం తెలిసిన కార్మికులు సుమారు 100 మందికి పైగా పెద్దాస్పత్రిలో తమ విధులు ఆపేసి రూరల్ ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి అనిల్‌పై ఫిర్యాదు చేశారు. అనంతరం దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పారు. ఆస్పత్రిలో సైతం పారిశుధ్యం దారుణంగా తయారైంది. ఇంత జరుగుతున్నా కార్మికులను పిలిచి విచారణ జరిపి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మిన్నకుండిపోయారు.

కరోనా కేసు మరొకటి నమోదు

- వెంకటగిరి యువకుడికి పాజిటివ్



నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రి (సర్వజన ఆస్పత్రి)లో మంగళవారం కరోనా కేసు మరొకటి నిర్ధారణ అయింది. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి జిల్లా వెంకటగిరి ప్రాంతానికి చెందిన 22 ఏళ్ల యువకుడు జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలతో బాధపడుతూ పెద్దాస్పత్రికి వచ్చాడు. ఇక్కడ అనుమానంతో కరోనా పరీక్ష చేయగా పాజిటివ్ వచ్చింది. ఆ యువకుడికి స్వల్ప లక్షణాలుండటంతో హోం ఐసోలేషన్‌లో ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచించి ఇంటికి పంపారు. ఇప్పటి వరకు నెల్లూరు నగరంలో చేసిన పరీక్షల్లో 9 మందికి కరోనా నిర్ధారణ అయింది. అందులో ఐదుగురు నగర వాసులు, మరో ఇద్దరు గ్రామాలకు చెందిన వారు. ఇంకో ఇద్దరు తిరుపతి జిల్లా వాసులు. ఆస్పత్రికి వచ్చిన అనుమానితులకు మాత్రమే ఇక్కడ కోవిడ్ పరీక్షలు చేస్తున్నారు. అలా చేయించుకోకుండా జలుబు, జ్వరం, గొంతులో నసతో బాధపడే వారు జిల్లాలో ఎంతోమంది ఉన్నారు?, వారందరికీ పరీక్షలు చేస్తే ఎంతోమంది బాధితులుగా ఉంటారని డాక్టర్లు పేర్కొంటున్నారు. వైద్యశాఖ ఇప్పటికైనా స్పందించి పెద్దఎత్తున పరీక్షలు నిర్వహించడంతోపాటు వ్యాధి నిర్ధారణ అయిన వారి ప్రాంతాల్లో జాగ్రత్త చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

టీచర్లకు తప్పని ఇక్కట్లు

- ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్
- తొలిరోజు 250 మందికి..
- మధ్యాహ్నం 3 గంటలకు రావాలని ఆదేశాలు
- రాత్రి 8 గంటలకు ప్రారంభమైన ప్రక్రియ

నెల్లూరు(టౌన్): టీచర్లకు బదిలీ ఇక్కట్లు తప్పడం లేదు. హెడ్‌మాస్టర్ల నుంచి ఎస్జీటీల వరకు ఇబ్బందులు పడిన పరిస్థితి. హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్జీటీలకు మాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో మంగళవారం నెల్లూరు దర్గామిట్టలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఎస్జీటీలకు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. తొలిరోజు 250 మంది హాజరుకావాలని మెసేజీలు పంపించారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభిస్తామని చెప్పిన జిల్లా విద్యాశాఖాధికారులు రాత్రి 8 గంటలకు ప్రక్రియను చేపట్టారు. సీనియారిటీ లిస్ట్‌ను పలుసార్లు మార్పులు చేపట్టి ఫైనల్ లిస్ట్‌ను ప్రకటించడంతో కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. ఇది పూర్తయ్యే సరికి అర్ధరాత్రి అయ్యే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అయితే మధ్యాహ్నం కౌన్సెలింగ్‌కు వచ్చిన ఉపాధ్యాయులు ఇక్కట్లు పడ్డారు. అనేకమంది దూర ప్రాంతాల నుంచి వచ్చారు. కూర్చొనేందుకు కనీసం కుర్చీలు కూడా లేని పరిస్థితి. బయట చెట్ల కింద, వరండాలో ఉపాధ్యాయులు పడిగాపులు కాశారు. సీనియారిటీ జాబితాపై సరైన అవగాహన లేకపోవడంతో కౌన్సెలింగ్ ఆలస్యమవుతున్నట్లు టీచర్లు మండిపడుతున్నారు. బుధవారం నుంచైనా ఉదయాన్నే ప్రక్రియ ప్రారంభించి సాయంత్రానికల్లా పూర్తి చేయాలని కోరుతున్నారు.



టీచర్ల పడిగాపులు

సాహస అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ టెన్సింగ్ నార్గే జాతీయ సాహస అవార్డు కోసం 2022, 2023, 2024 సంవత్సరాల్లో సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన, నైపుణ్యం ప్రదర్శించిన వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు https://awards.gov.in ద్వారా మాత్రమే నామినేషన్లను ఈనెల 30వ తేదీలోగా పంపాలని కోరారు.

ప్రారంభోత్సవాలు నేడు

నెల్లూరు రూరల్: జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బుధవారం వివిధ పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరుగుతాయని ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం మూడు, కొన్నిచోట్ల అంతకంటే ఎక్కువ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు జరుగుతాయన్నారు. అలాగే మంజూరైన పనులకు ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.